

అప్పుడే యవ్వనంలోకి అడుగుపెట్టిన పదారేళ్ళ ముద్దుగుమ్మ బుగ్గల్లో చిదిమిన సిగ్గులా ఆకాశం ఎర్రగా వుంది.

ఆ అందాన్ని నలుదిక్కులా ప్రచారం చెయ్యాలన్న తపనలో పక్షులు కిలకిలమంటూ అరుస్తూ ఆకాశాన ఎగుర్తున్నాయి. పెరట్లో గన్నేరు మొక్కకి యువతలగా కూర్చుని కొబ్బరాకుల సందుల్లోంచి ఆకాశం కేసి చూస్తున్న కవిత కవితా కన్యకలా సుతారంగా వుంది.

తమ్ముడు రాటకి కట్టిన లేగదూడ కట్టు విప్పినట్లున్నాడు. ఆ దూడ చెంగున గెంతుతూ దొడ్డంతా కలియ తిరుగుతూంటే దాని మెడలో కట్టిన మువ్వలు గలగలమని శబ్దం చేస్తున్నాయి. ఆ శబ్దాలు కవితగుండె లోతుల్లో మల్లెలతో సుతారంగా కొడుతున్న అను భూతికి లోను చేస్తున్నాయి.

ప్రతి కుర్రదాని జీవితంలోకి ఓ కుర్రవాడు హీరోగా, ప్రియుడై తొంగి చూడక తప్పదనుకుంట! అలాంటి కుర్ర హీరో క్రిష్ణమూర్తి గాడు ఉరఫ్ కిష్టాయ్ గాడితో కవితకి పెళ్ళి అనే కబురు ఎలా పైకొచ్చిందో ఏమో - అంతా వాళ్ళని వధూవరుల్ని చూసినట్లు చూడ్డం ఆరంభించారు. ఇంట్లోని బామ్మలు, అత్తలు, పిన్నులు, అక్కలు, వెల్లెళ్ళు, బాబాయ్‌లు మావయ్యలు తలో జోకూ విసిరేసరికి కిష్టాయ్‌గాడి పని సిగ్గైపోడం, చాటు మాటుగా కవిత ఎదురుపడితే హీరో అయిపోవడం జరుగుతూంది. కిష్టాయ్ గాడి వ్యవహారం అలా వుంటే అసలేమిటో అర్థమయ్యీ కాని వ్యవహారంలో ఎడ తడ బడి పోతూ గిన్నెల్ని తన్నెయ్యడం, గడపల్ని తన్నెయ్యడం, హఠాత్తుగా పరిగెత్తెయ్యడం లాంటివి చేసేస్తూ చాటు మాటుగా దడదడలాడే గుండెని అదుము కుంటూ 'అమ్మో! పెళ్ళే!!?' అని బెదిరిపోవడం కవిత వంతయింది. సిగ్గులు బుగ్గల్ని కమ్మెయ్యడం, ముసిముసి నవ్వులు పంటికింద నొక్కెయ్యడం లాంటివి చేస్తున్న కవిత తన కాలి స్టైల నవ్వడితో బావ మనసు గుంజేస్తుంది.

ఆ సవ్వడి ఎటు వినవస్తే అటు కిష్టాయ్ మెడ తిరిగిపోతుంది. కాని కవిత కనబడదు. మనసు విలవిల లాడుతుంది.

ఈ పెళ్ళి ప్రసక్తి రాకముందు - అంటే రెండేళ్ళ క్రితం వేసంగి శలవుల్లో కిష్టాయ్ బావ, అత్తయ్య వాళ్ళు వచ్చినప్పుడు 'ఒరేయ్ బావ, ఏరా బావ' అంటూ వెట్టా పట్టాలేనుకుని దొడ్డంతా కలయతిరుగుతూ ఆడుకునే వారు. ఊరవతల సెల్తోటలోకి పోయి సపోటా చెట్టెక్కి సరిగా పండీ పండని పళ్ళని సగం సగం కొరికి క్రిందకి గిరవాటే స్తూండేవారు. బావకన్నా కవితే చిటికెలో ఎలాంటి చెట్టైనా ఎక్కేసి బావని వెక్కి రించేది. బావ ఉడుకు మోత్తనంతో "కిందకి దిగు లం... తంతా" అనే వాడు.

"అట్టే వాక్కు. నువ్వే లం...వి... నువ్వే లం... కొడుకువి. చెట్టెక్కడం చేతకాక పైగా తిడతావెందుకు?" అని మరింత వెక్కిరించేది.

"నువ్వు ఆడపిల్లవి కావు. దెయ్యానివి, రాక్షసివి , శూర్పణఖవి - నీతో పచ్చి" అంటూ 'ఖా' కొట్టేసి పారిపోయేవాడు కిష్టయ్య.

ఇప్పుడు కిష్టయ్య గొంతు కీచుతనం పోయి బొంగురయింది. మామూగు మీసాల నవయువ్వనం పొడచూపుతోంది. నిక్కర్లనించి పాంట్లలోకి వచ్చాడు. కవిత పెద్ద మనిషయి ఏడాదయింది. ఇప్పుడిప్పుడే బుగ్గలు నునుపుదేరాయి. భుజాలు గుండ్రమయాయి. గుండెలు ఎత్తయాయి. ఇప్పుడు గౌనులు వేయడం లేదు. లంగా జాకెట్టు వేస్తూంది. ఓణీ వేసినా ఎక్కువ సేపు వుంచుకోదు. చిరాకని తీసేస్తూ వుంటుంది.

కిష్టయ్య మాపులు తన కొంతల్ని వల్లెవేస్తున్నాయన్న సంగతి ఓరకంట కవిత కనిపెట్టినా తెలియనట్లు అతని ముందు నించి పరిగెడుతుంది.

ఇదివరకటిలా కాకెంగిలి తింటూ భుజాల మీద చేతులేసుకుని చెంగున గెంతుతూ కబుర్లాడే కవితలా లేదిప్పుడు. బయటికి పోతే పక్కింటి వర్ధనమ్మతో చింతపిక్కలాడుతుంది. ఇంట్లో వుంటే పెద్ద వాళ్ళ మధ్య చేరి వంటింట్లో వాళ్ళ కబుర్ల మధ్య మాట కలుపుతుంది. కిష్టయ్యకి ఒంటరిగా చిక్కడం లేదు. ఎప్పుడన్నా చిక్కినా ఇది వరకటంత ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు.

ఏమిటీ మార్పు? ఏమిటిది?

ఏమో ...

ఏమీ అర్థం కావడం లేదు.

సరిగ్గా అలాంటి సమయంలోనే పక్కింటి సిలక మాష్టారి మూడో

23-6-1989 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

అమ్మాయి కిష్టాయ్‌ని పిలిచింది. కిష్టాయ్ కదల్లేదు. మళ్ళీ నవ్వుతూ సైగ చేసింది 'రమ్మ'ని. కిష్టాయ్ వీథి అరుగు మీంచి ఇంట్లోకి చూశాడు. ఎవరూ తనని గమనించడం లేదు. ఈ వీథి మొగనించి అటు వీథి మొగ వరకూ చూశాడు. ఎవరూ వస్తున్న జాడ లేదు. మళ్ళీ పిలక మేష్టారి మూడో అమ్మాయ్ కేసి చూశాడు.

ఆ అమ్మాయ్ కళ్ళలోనే గదమాయిస్తూ రమ్మని పిలిచినట్లయింది. గబగబా ఆమె దగ్గరకెళ్ళి పైమెట్టు మీద కుడికాలు పెట్టి, మెట్టును బొటన వ్రేలితో రాస్తూ 'ఎందుకు?' అన్నట్లు చూశాడు.

"రావోయ్, కిష్టాయ్!" అంటూ ఆమె అరుగుమీంచి ఇంట్లోకి వెళ్ళింది. అప్రయత్నంగానే ఆమె వెంట వెళ్ళాడు.

"మా నాన్న స్కూలు కెళ్ళాడు. మా తమ్ముడు స్కూలుకెళ్ళాడు. మా అమ్మ మా బంధువుల ఇంట్లో ఊరగాయ పెడ్తుంటే సాయానికెళ్ళింది. కాబట్టి ఎవరూ లేరు. ఫరవాలేదు లోపలికి రా" అంటూ హాలులోంచి పక్క గదిలోకి తీసికెళ్ళింది. "అలా కూచో" అంటూ పందిరి మంచం చూపించింది. మంచం అంచున కూర్చున్నాడు.

ఆ అమ్మాయి మాటలో ఏదో తియ్యదనంతో కూడిన శాసనం వుంది. మాట తియ్యగానూ వుంది. శాసిస్తున్నట్లూ వుంది. ఆ అమ్మాయి సన్నగా పొడుగ్గా రివటలా వుంది. ఆమె అంత అందగత్తె కాకపోయినా మంచి ఆకర్షణ వుంది. ఎందుకు పిలిచినట్లు? గుండె దడదడలాడుతూంది కిష్టాయ్‌కి.

"ఇదిగో, ఇటు చూడు" అంది.

తలపైకెత్తాడు.

"కవితకీ నీకూ పెళ్ళట గదా?"

ఏం చెప్పలేదు. తల దించుకున్నాడు.

"కవితంటే ఇష్టమేనా?"

భుజాలెగరేసి గోళ్ళు గిల్లుకుంటున్నాడు.

అది ఇష్టమూ, అయిష్టమూ అన్నది అర్థం కాలేదు.

"కవితని ప్రేమిస్తున్నావా?"

'ఏమో' అన్నట్లు పెదవి విరిచి భుజాలు ఎగరేశాడు.

"ఇన్ని ప్రశ్నలు వేస్తున్నా ఒక్క దానికీ సమాధానం చెప్పవేమయ్యా? సిగ్గా? భయమా?"

ఆమెకేసి చూసి, నవ్వి తలదించుకున్నాడు.

"బహుశా, నేను నీ వయసు దాన్నే అయినా — నాకు రెండేళ్ళ క్రితమే పెళ్ళైంది. కాబట్టి పెద్దరికంతో మాట్లాడుతున్నాను. ఇకనైనా సిగ్గుపడకుండా ఓ మగాడిలా సమాధానం చెప్పు" అంటూ అతని భుజం తట్టింది.

సరిగ్గా అప్పుడు గమనించాడు. తనకు పరిచయమైన కాలి మువ్వల సవ్వడి. గబగబా అటూ ఇటూ వెతికినట్లు చూశాడు.

ఆ అమ్మాయి నవ్వుతూ "ఇదిగో ఇటు చూడు" అంటూ తన లంగాని మోకాళ్ళవరకూ పైకెత్తి "నేనూ, కవితా ఒకేసారి ఒకే రకం పి.వి.ఆర్. వెండి పట్టాలు ఒకే కొట్లో కొన్నాం" అంటూ చూపించింది.

ఆమె కాళ్ళకేసే చూస్తున్నాడు.

"పట్టాలు సరిగా కనిపిస్తున్నాయా" విసురుగా కదపడంతో, లంగా పైకి దొర్లింది. కిష్టయ్య గబుక్కున మంచం అంచుమించి లేచి ఖంగారుగా ఆమెని దాటి ముందుకు పోబోయాడు. లంగాని దించేస్తూ అతని చెయ్యిని పట్టుకుని మంచం వైపు లాగి కూర్చోబెట్టి "ఖంగారడకోయ్" అంది కళ్ళెగరేస్తూ కొంటెగా.

'ఇదెక్కడి రోజే పిల్లరా బాబూ' అనుకున్నాడు మనసులో.

"ఇదో కిష్టాయ్ బాబు, నువ్వు నన్ను కాసేపు ప్రేమించాలి. ప్రేమించడం అంటే మరేం కాదు - నువ్వు. నన్ను గట్టిగా హృదయానికి హత్తుకుని మత్తుగా 'నా హృదయేశ్వరీ' అనాలి. నా నుదుటిని ఒక ముద్దు పెట్టుకోవాలి. నీ ముని వేళ్ళలో నా కురులు సవరిస్తూ బుగ్గల్ని చుంబించాలి. అలాలా కౌగిలిలో కరిగిపోతున్న సమయంలో సినీ హీరోలా హఠాత్తుగా నా పెదిమల్ని నీ పెదాలతో హత్తి గాఢంగా ముద్దెట్టెయ్యాలి. అలా ప్రారంభమైన కథ దానంతటదే అప్రయత్నంగా ముందుకు సాగిపోతుంది. ఏమంటావ్? రెడీయేనా?" అంటూ అతనికి దగ్గరగా జరిగి ఓణీ తీసేసింది.

చేతిలోని కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ "నే వెళ్తా" అన్నాడు లేస్తూ.

"నేనందంగా లేనా?" అడిగింది ఆమె.

"నే వెళ్తా"

"నేన్నీకు నచ్చలేదా?"

"నే వెళ్తా"

"పోనీ నన్ను నీ కవితనే అనుకో"

"నే వెళ్తా"

"నీ మీద నమ్మకంతో - ఎంతో విరహంతో పిలిచా-"

"నే వెళ్తా"

"నన్ను నిరాశ పరుస్తావా?"

"నే వెళ్తా"

"పోనీ రేపు సమయం చూసి పిలుస్తా వస్తావా?"

"రాను."

"నీ కిష్టం లేదా?"

"నాకిష్టమే."

"మరెందుకీ జాప్యం?"

"నీతో కాదు - నా కవితతో"

"ఆహా ఏం ప్రేమయ్యా? భేష్!"

"నే వెళ్తా."

"వెళ్ళు."

కిష్టాయ్ వెళ్ళిపోయాడని నిర్ధారణ అయిం తర్వాత పందిరి మంచం క్రింద నుంచి గలగలమని నవ్వుతూ కవిత బయటికొచ్చింది.

పిలక మేష్టారి అమ్మాయి కవితని గట్టిగా కావలించుకుంటూ "నీ బావ అమర ప్రేమికుడోయ్. నిర్భయంగా నువ్వతన్ని నమ్మేసి పెళ్ళాడేసెయ్యొచ్చు. మంచి అందగాడు. పైగా మంచివాడు. అపర శ్రీరామచంద్రుడంటే నమ్ము. మన పరీక్షలో నెగ్గేడంటే నీ బ్రతుక్కేం ఢోకా లేదని నా హామీ" అంటూ సుతారంగా కవిత తల మీద మొట్టింది.

ఆ కథ ఆ రోజుకలా సుఖాంతమవగా మరుసటి రోజు ......

పిలక మేష్టారి ఇంట్లో ఆయన మూడో అమ్మాయి లోపలి గదిలో పందిరి మంచం మీద అదమరచి నిద్రపోతుంది. పమిట పక్కకి తొలగి ఊపిరి పీలుస్తుంటే గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. పసుపు రంగు మీద నల్ల పూల లంగా మోకాళ్ళ పైగి తొలగి వుంది. కుడి చేతి వేపుదిండు కివలగా సగం పేజీలతో బోర్లించి వుందో నవల.

ఆమెకు వున్నట్టుండి గుండెలు బరువెక్కినట్లవుతూంది నిద్రలో. మోకాళ్ళ పైన ఏవో తడుముతున్నట్లు మధురానుభూతికి లోనవుతూంది నిద్రలో. నల్లని మెడ మీద వేడి వేడి శ్వాస ఎటో తీసుకుపోతున్నట్లుంది నిద్రలో.

పెదిమల మీద తడితో కూడిన వేడి ముద్దు గిలిగింతలు పెడ్తుంటే ఏదో తెలియని లోకాల్లోంచి హఠాత్తుగా నిద్ర కాదిది వాస్తవమన్న స్పృహలోకొచ్చి కళ్ళు తెరిస్తే —

ఎదురుగా

కిష్టాయ్

(ఆ కథ అలా ఆ రోజు మలుపు తిరిగింది.)

పిలక మేష్టారి మూడో అమ్మాయి జీవితాన్ని చూసింది.

కవిత జీవితాన్ని చూడ్డానికి జీవితం లోకి అడుగుపెడుతూంది.

స్వస్తిశ్రీ చంద్రమాన విభవ నామ సంవత్సర మాఘ శుద్ధ చవితి గురువారం ది. *9-2-89* రాత్రి గం. *1-05* (అనగా *10-2-89* తెల్లవారితే) నిమిషములకు ఉత్తర భాద్ర నక్షత్ర యుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశమందు కవితని కృష్ణమూర్తి కిచ్చి వివాహం.

ఇంకెన్ని రోజులో లేదు. 'పట్టుమని పది రోజులు కూడా లేదు' అనుకుంది మనసులో కవిత అలా ఎరుపుపోయి నలుపు పులుముకుంటున్న ఆకాశాన్ని కొబ్బరాకుల్లోంచి చూస్తూ.

ముసి ముసి మురిపాలు హృదయంలో ఉవ్వెత్తున లేస్తుంటే తనూ లేచింది దీపాలు వెలిగించాలని.

*